జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 10-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 668 పేజీలు: 4 వెల : రూ.7

## పలాస-కాశీబుగ్గలో..
# హత్యాయత్నం

☀ ఓ వ్యక్తి గొంతు కోసేసిన ఇద్దరు వ్యక్తులు ☀ రక్తపు మడుగులో యువకుడు ☀ హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు ☀ పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు ☀ ప్రేమ వ్యవహారమే కారణమా? ☀ జంట పట్టణాల్లో భయాందోళనలు

**పలాస, మే 9 (వార్త):** కాశీబుగ్గలో జరిగిన ఓ యువకుడిపై కత్తి దాడి ఘటన తీవ్ర సంచలనం రేపింది. పట్టణంలోని కేటీ రోడ్డులో ఉన్న బిగ్ లాట్ షాపులో పని చేస్తున్న యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడటం స్థానికంగా భయాందోళనలకు గురిచేసింది. ప్రేమ వ్యవహారం, కుటుంబ విభేదాలు, పెళ్లి సంబంధం రద్దు వంటి కారణాల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రస్తుతం శ్రీకాకుళం జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా..కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కాశీబుగ్గ పట్టణంలోని కేటీ రోడ్డులో ఉన్న బిగ్ లాట్ షాపులో శనివారం జరిగిన కత్తి దాడి ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. షాపులో పని చేస్తున్న లోలుగుల ఈశ్వరరావును లక్ష్యంగా చేసుకుని పలాస రాజమ్మ కాలనీకి చెందిన రాజాం తిరుపతి అనే యువకుడు తన సహచరుడు కన్నతో కలిసి షాపులోకి ప్రవేశించాడు. ముందుగా ఈశ్వరరావును బయటకు తీసుకువచ్చిన ఇద్దరు యువకులు అతనితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగింది. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి లోనైన తిరుపతి తన వెంట తీసుకువచ్చిన కత్తితో ఈశ్వరరావు గొంతును కోసేశాడు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఘటనతో షాపు పరిసర ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రక్తపు మడుగులో కుప్పకూలిన ఈశ్వరరావును గమనించిన బిగ్ లాట్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ సిఐ వై రామకృష్ణ తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకుని బాధితుడి కుటుంబ సభ్యులు, స్నేహితులను విచారించారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా దృశ్యాలను కూడా సేకరిస్తున్నారు.



### ప్రేమ వ్యవహారమే.. కారణమా?

ప్రేమ వ్యవహారమే ఈ దాడికి ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈశ్వరరావు అన్న రమేష్ నిందితుడు తిరుపతి సోదరితో ప్రేమాయణం కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. ఆ యువతి పెళ్లి సంబంధం ఇటీవల రద్దు కావడానికి ఈశ్వరరావే కారణమన్న అనుమానంతో తిరుపతి కోపాన్ని పెంచుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఇదే వివాదం క్రమంగా శత్రుత్వానికి దారి తీసి చివరకు కత్తి దాడికి కారణమైనట్లు తెలుస్తోంది. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని బట్టి కేసులో మరిన్ని సెక్షన్లు చేర్చే అవకాశమున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. వారిని పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఈ ఘటనతో కాశీబుగ్గలో ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది.



# రూ.37లక్షలు.. గోవిందా!

❋ ఒడిశాకు పేకాటకు వెళ్లిన సిక్కోలువాసులు ❋ అక్కడి తోటల్లో ఆడుతుండగా తుపాకులతో ఓ గ్యాంగ్ ప్రత్యక్షం ❋ పేకాటరాయుళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు దోపిడీ ❋ కట్టుబట్టలతో తిరిగొచ్చిన పేకాటరాయుళ్లు

**శ్రీకాకుళం క్రైం, మే 9 (వార్త):** పేకాట ఆడేందుకు పక్క రాష్ట్రానికి వెళ్లి సర్వం కోల్పోయిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 12 మంది నుంచి నగదు, బంగారాన్ని ఒడిశాకు చెందిన ఓ గ్యాంగ్ దోచేసింది. దీంతో వారంతా డబ్బులు పోతే పోయింది.. ప్రాణాలు మిగిలింది.. అంటూ జిల్లాకు తిరిగివచ్చారు. ఈ విషయం ఆనోటా ఈనోటా పాకడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం జిల్లాలో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు విస్తృతం చేసిన నేపథ్యంలో జిల్లాకు చెందిన కొందరు పేకాటరాయుళ్ల పక్కనున్న ఒడిశాకు వెళ్లి పేకాట ఆడుతున్న విషయం తెలిసిందే. కొందరు వీకెండ్‌లో వెళుతుండగా, మరికొందరు నిత్యం పేకాట ఆడేందుకు వెళుతుంటారు. జిల్లాకు చెందిన కొందరు ఒడిశావాసులతో కలిసి ఒడిశాలోని తోటల్లో పేకాట నిర్వహిస్తుంటారు. అయితే గురువారం 12 మంది.. మూడు కార్లలో ఒడిశాలోని రాయగడ సమీపంలో ఓ మామిడి తోటలోకి వెళ్లారు. అందరూ లక్షల్లోనే నగదు తీసుకువెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తోటలో పేకాట ఆడుతున్న సమయంలో ఓ గ్యాంగ్ వారి వద్దకు తుపాకులతో వచ్చి దాడులు చేశారు. అక్కడున్న డబ్బులతో పాటు పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలను దోచేసి పరారయ్యారు. వారి దోచేసిన సుమారు 37లక్షలు వరకూ ఉంటుందని అంచనా. గ్యాంగ్ వెళ్లిపోయిన తర్వాత పేకాటరాయుళ్లు కట్టుబట్టలతో కార్లలో తిరిగొచ్చారు. ఈవిషయం ఆనోటా ఈనోట పాకింది. పరువు పోతుందన్న ఉద్దేశంతో పేకాటరాయుళ్లు సైతం పోలీసుకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.



## కిడిమి సచివాలయంలో పనిచేయని సోలార్ వ్యవస్థ



**సారవకోట, మే 9 (వార్త):** సారవకోట మండలం కిడిమి సచివాలయంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ వ్యవస్థ గత కొన్ని రోజులుగా పనిచేయడం లేదని వీఆర్వో రాము శనివారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.1.55 లక్షల వ్యయంతో ఈ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో కూడా సచివాలయంలో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం సోలార్ వ్యవస్థ పనిచేయకపోవడంతో సచివాలయ పనులు ప్రభావితమవుతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయాల సమయంలో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సోలార్ వ్యవస్థను త్వరితగతిన మరమ్మతులు చేసి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



## రేషన్ బియ్యం స్వాధీనం

**నరసన్నపేట, మే 9 (వార్త):** నరసన్నపేట మండలం దేవాది గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారి డి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం నుంచి పర్లాకిమిడి వైపు వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. అనంతరం బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఉపాధ్యాయుడు ఇంట్లో చోరీ

*** ఐదు తులాలు బంగారం, 70 వేలు నగదు అపహరణ**





**పలాస, మే 9(వార్త):** కాశీబుగ్గలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంట్లో దొంగలు చొరబడి 5 తులాల బంగారం, 70 నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించకు పోయారని కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ వెల్లడించారు. శ్రీనివాసనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు హేమశంకర్ అలియాస్ బుజ్జి వేసవి సెలవుల కారణంగా స్వగ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంట్లో గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. ఇంట్లోని బీరువా తాళాలు తీసి బంగారం, వెండి ఆభరణాలు, 70 నగదు అపహరించినట్లు సమాచారం. శనివారం ఉదయం ఘటన గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ గురైన సంఘటన తెలుసుకుని పోలీసులు సంఘటన స్థలం చేరుకుని, శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం చేరుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం




**ఇచ్ఛాపురం మే 9 (వార్త):** ఇచ్ఛాపురం పట్టణంలోని 23వ వార్డు బెల్లుపడ కాలనీ రెండో లైన్‌లో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టులు స్థానికులకు భయాందోళన కలిగిస్తున్నాయి. చెట్టులోని కొబ్బరికాయలు అకస్మాత్తుగా రోడ్డుపై వెళ్తున్న ప్రజలపై పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కొబ్బరి చెట్లకు చెందిన మట్టలు సమీపంలోని విద్యుత్ వైర్లపై పడడంతో మంటలు చెలరేగుతున్నాయని తెలిపారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లలోని గృహోపకరణాలు షార్ట్‌సర్క్యూట్‌కు గురై కాలిపోతున్నాయని వాపోయారు. ఇంకా ప్రక్కనే ఉన్న విద్యుత్ స్థంభం పాడై ఒకవైపుకు వంగిపోయి ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ కొబ్బరి చెట్టులు ప్రజలకు ముప్పుగా మారాయని, ఇంటి యజమానికి కూడా పలుమార్లు తెలియజేసినా స్పందన లేదని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారిన కొబ్బరి చెట్టులను వెంటనే తొలగించి, వంగిపోయిన విద్యుత్ స్థంభాన్ని మార్చి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## ఈసెట్‌లో మెరిసిన లింగాలవలస విద్యార్థి పవన్ కళ్యాణ్



**జలుమూరు, మే 9 (వార్త):** జలుమూరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన పంచి రెడ్డి పవన్ కళ్యాణ్ ఏపీ ఈ-సెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. శుక్రవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో పవన్ కళ్యాణ్ రాష్ట్ర స్థాయిలో 33వ ర్యాంకు సాధించగా, ఇంటిగ్రేటెడ్ ర్యాంకులో 973వ స్థానం దక్కించుకుని మెరిశాడు. పదో తరగతిని జలుమూరు ఆదర్శ పాఠశాలలో పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ అనంతరం డిప్లొమా విద్యను అభ్యసించి ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈ-సెట్ పరీక్ష రాశాడు. కృషి, పట్టుదలతో మంచి ర్యాంకు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ తల్లిదండ్రులు జయలక్ష్మి, ప్రకాశ్ రావు వ్యవసాయదారులుగా జీవనం సాగిస్తున్నారు. కుమారుడు సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## రోడ్డుపై ఇంజన్ ఆయిల్



**నరసన్నపేట, మే 9 (వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం నుంచి ఇంజన్ ఆయిల్ జారిపడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుపై ఆయిల్ వ్యాపించడంతో పది మందికి పైగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి జారిపడి గాయపడినట్లు సమాచారం. ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. రహదారిపై ఇసుక, మట్టి చల్లి వాహనాలు సురక్షితంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు. ప్రమాదాల నివారణలో ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు.

# నరసన్నపేట రోడ్డుపై మురుగునీరు

*** రోగాల బారిన బండివీధి, కోరాడవీధి, మారుతీనగర్‌వాసులు**

*** పట్టించుకోని పంచాయతీ అధికారులు**

*** కలెక్టర్ గారు స్పందించాలని కోరుతున్న కాలనీవాసులు**



**నరసన్నపేట, మే 9 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని బండి వీధి సమీపంలోని కోరాడ వీధిలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్డంతా వ్యాపించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా దుర్గంధం వ్యాపిస్తూ పరిసర ప్రాంతాల్లో అసౌకర్యకర పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు నరసన్నపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన పారిశుధ్య, అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, మరోవైపు ఇలాంటి సమస్యలు కొనసాగడం విచారకరమని స్థానికులు అంటున్నారు. చెత్త సేకరణ కూడా సక్రమంగా జరగడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



### మారుతి నగర్‌లో మురుగునీటి సమస్య

నరసన్నపేట పట్టణంలోని మారుతి నగర్ నాలుగో వీధిలో నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు మరింతగా చేరి చెరువును తలపించే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. దీంతో ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు అధికంగా పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. మురుగునీరు తొలగించకపోవడంతో రాకపోకలు కూడా కష్టంగా మారాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి మురుగునీటిని తొలగించాలని స్థానికులు శుక్రవారం విన్నవించారు.

## నరసన్నపేట డంపింగ్ యార్డులో ఆధునిక బేలింగ్ యంత్రం


నరసన్నపేట మేజర్ పంచాయతీ డంపింగ్ యార్డులోని చెత్త సంపద కేంద్రంలో ఆధునిక సాంకేతికతతో పనిచేసే బేలింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించి రీసైక్లింగ్‌కు పంపించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ బేలింగ్ యంత్రం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను కుదించి బండిల్స్ రూపంలో తయారు చేసి రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో ఈ ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అందులో భాగంగా తొలి దశలో నరసన్నపేటలో ఏర్పాటు చేసిన బేలింగ్ యంత్రాన్ని ఈ నెల 16వ తేదీన నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నరసన్నపేటలో పారిశుధ్య నిర్వహణకు కొత్త దిశ లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పారిశుధ్య నిర్వహణలో మహిళల పాత్ర కీలకం

*** జడ్పీ సీఈవో వెంకట్రామన్ * నరసన్నపేట పప్పులవీధిలో అవగాహన**

పారిశుధ్య నిర్వహణ పట్ల మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని జడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్ పేర్కొన్నారు. నరసన్నపేట పట్టణంలోని పప్పుల వీధిలో శనివారం మహిళలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా నిల్వ చేసి, ఇంటింటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు నేరుగా అందించాలని సూచించారు. చెత్తను రహదారులపై పడేయడం వల్ల పరిశుభ్రత దెబ్బతింటుందని, దోమలు, వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుందని వివరించారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య బృంద సభ్యులు మరియు మహిళలు పాల్గొన్నారు.



## అధికారులు.. అలసత్వం వద్దు: జిల్లా కలెక్టర్



నరసన్నపేట పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావులేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నరసన్నపేటలో పర్యటించి, పారిశుధ్య పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఏర్పాట్లు తుది దశకు చేరుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శనివారం ఉదయమే నరసన్నపేట చేరుకున్న కలెక్టర్, వెంకటేశ్వర థియేటర్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. రోడ్ల వెంట ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రధాన మార్గాల్లో ఎక్కడా పారిశుధ్య లోపాలు కనిపించకూడదని హెచ్చరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వార్డుల వారీగా నియమించిన ఇన్చార్జ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో పట్టణం సుందరంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





## జల్ జీవన్ మిషన్ పనులు పూర్తయ్యేనా?

*** రెండున్నరేళ్లుగా నత్తనడకన పనులు * నీటి కోసం ఎదురుచూపులు**

**జలుమూరు, మే 9(వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ప్రారంభించిన పనులు రెండున్నరేళ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు తవ్వి మరి పైపులైన్లు వేసినప్పటికీ ఇప్పటికీ ఇంటింటికీ కుళాయిలు అమర్చకపోవడంతో పాటు ట్యాంక్ నుంచి ఇవ్వాల్సిన మెయిన్ కనెక్షన్ కూడా ఇవ్వలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వేసిన పైపులు వినియోగం లేక దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. చుట్టుపక్కల చిన్న గ్రామాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నప్పటికీ, మేజర్ పంచాయతీ అయిన శ్రీముఖలింగంలో మాత్రం పనులు నిలిచిపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు మధ్యలో నిలిచిపోవడంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో రహదారులు కూడా దెబ్బతిన్నాయని పేర్కొంటున్నారు. ఈ విషయమై నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ నీరు అందిస్తామని పైపులైన్లు వేసి కుళాయిలు అమర్చినా ఇప్పటివరకు నీటి సరఫరా ప్రారంభం కాలేదన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోయిందని తెలిపారు. అయితే ఈ విషయంపై జేఈ మధుసూదనరావు స్పందిస్తూ మిగిలిన పనులను త్వరలో పూర్తి చేసి గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నవధాన్యాల సాగుతో భూసారం




**నరసన్నపేట, మే 9 (వార్త):** నవధాన్యాల సాగు ద్వారా భూసారం గణనీయంగా పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం దేవాది ప్రకృతి వ్యవసాయ క్లస్టర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులకు 500 నవధాన్యాల కిట్లను అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ విత్తనాలను సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాలు పెరిగి భూమి సారవంతం అవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో మెరుగైన దిగుబడులు అందించగలవని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకుని నవధాన్యాల సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాగావళి నీరు.. కలుషితం

*** మురుగునీటితో నిండిన నది * పట్టించుకోని నగరపాలక సంస్థ**
*** శ్రీకాకుళం నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**



**శ్రీకాకుళం, మే 9 (వార్త):** నాగావళి నదిలో జల కాలుష్యాన్ని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. నాగావళి నదిలోకి మురుగునీటిని విడిచిపెడుతూ జల కాలుష్యానికి కారణమవుతున్న అధికారులు, పాలకుల తీరును తప్పుపడుతూ సిపిఎం ఆధ్వర్యంలో నాగావళి నది తీరంలో శనివారం నాయకులు, కార్యకర్తలు నిరసనలను తెలియజేశారు. మురుగునీటిని శుద్ధి చేయకుండా నేరుగా నాగావళి నదిలోకి విడిచిపెడుతండడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి శుద్ధి ప్లాంట్ పనుల ముందుకు సాగకపోగా దాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. తక్షణం నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి మురుగునీటిని శుద్ధి చేసి పైపు లైన్ ద్వారా బయటకు విడిచిపెట్టే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు మాట్లాడుతూ మూడు సార్లు ఎంపిగా గెలుపొంది కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడు తన పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన శ్రీకాకుళం నగరంలో నాగావళి తీరం కలుషితం అవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు పై ఆయన శ్రద్ధ చూపడకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి నాగావళి నదిలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేదంటే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## వేసవి హోంవర్క్‌ల పరిశీలన



**నరసన్నపేట, మే 9 (వార్త):** వేసవి సెలవుల్లో భాగంగా విద్యార్థులకు ఇచ్చిన వర్క్‌షీట్లు, హోంవర్క్‌లను ఉపాధ్యాయులు పలు పాఠశాలల్లో పరిశీలిస్తున్నారు. శనివారం ఉదయం నరసన్నపేట మండలం మడపాం పంచాయతీ కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు దామోదర్ విద్యార్థుల హోంవర్క్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోకుండా ఉండేందుకు వేసవి సెలవుల్లో కూడా విద్యా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. హోంవర్క్‌లు, వర్క్‌షీట్ల ద్వారా విద్యార్థుల్లో పునశ్చరణ అలవాటు పెంపొందుతుందని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి చదువుపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులు సూచించారు.

## పచ్చిరొట్ట విత్తనాలతో మెరుగైన దిగుబడి



**నరసన్నపేట, మే 9 (వార్త):** ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగా పచ్చిరొట్ట విత్తనాలను దుక్కుల్లో వేసుకుంటే భూమి సారవంతం పెరిగి మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారి వై. సూర్య కుమారి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పంట దిగుబడులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా జీలుగు, పిల్లి పెసర, కట్టే జనుము వంటి విత్తనాలను కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట పంటలు భూమిలో సేంద్రియ పదార్థాలను పెంచి నేల నాణ్యతను మెరుగుపరుస్తాయని వివరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

## టెన్త్ టాపర్‌కు సత్కారం




**పలాస, మే 9 (వార్త):** కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తి పండా ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల తరఫున పలాస డివిజన్ లెవల్ లో 591 మార్కులతో టాపర్గా నిలవడంతో శనివారం శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సత్కారం చేశారు. సికోలు సైనింగ్ స్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ హాజరై విద్యార్థికి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రవికుమార్, వైద్యులు దానేటి శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం వసుదైక కుటుంబం ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో కూడా పలాస డివిజన్లో టాపర్‌గా నిలిచిన కీర్తిపండను సత్కారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం ప్రారంభం




**శ్రీకాకుళం, మే9 (వార్త):** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు సందర్భంగా శ్రీకాకుళం జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. జూనియర్ ఎన్టీఆర్ గారి పుట్టినరోజు సందర్భంగా అభిమానులందరూ కలిసి ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషకరమన్నారు. రక్తదానం చేసి ప్రాణదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఇంతటి మంచి ఆలోచన చేసిన జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుంగ శ్రీధర్, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్రి మధు, అభిమానులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

## రమ్యకు సిక్కోలు షైనింగ్ స్టార్ అవార్డు



**సంతబొమ్మాళి, మే 9(వార్త):** దండు గోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థిని మద్దెల రమ్య 581 మార్కులు సాధించింది. ఈ విషయంపై సిక్కోలు షైనింగ్ స్టార్ అవార్డ్‌కు ఎంపికై, శనివారం శ్రీకాకుళం లోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవములో స్థానిక ఎమ్మెల్యే, జిల్లావిద్యాశాఖాధికారి చేతుల మీదుగా ప్రశంసాపత్రము, జ్ఞాపిక అందుకంది. దండు గోపాలపురం పాఠశాలకు ఇంతటి గౌరవం దక్కడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సాధారణ వ్యవసాయకూలీ కుటుంబానికి చెందిన రమ్య క్రమశిక్షణతో చదివి సంతబొమ్మాళిలో గల అన్నీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులందరీ కంటే రమ్య ఎక్కువ మార్కులు 581 సాధించిమండలానికి, పాఠశాలకు పేరు తీసుకువచ్చిందనీ,ఈమె తరువాత బ్యాచ్ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. ఈమెవిజయము పట్ల విద్యార్థులు, కమిటీ సభ్యులు గ్రామపెద్దలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.




## ఎస్సై ట్రైనింగ్‌కు ఏఎస్ఐ అసిరినాయుడు



**నరసన్నపేట, మే 9 (వార్త):** నరసన్నపేట పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పల్లి అసిరి నాయుడికి ఎస్సైగా ట్రైనింగ్ పొందేందుకు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైగా ట్రైనింగ్కు వెళ్తున్న అసిరినాయుడిని స్థానిక ఎస్సై గణేశ్, సిబ్బంది అభినందించారు.


## శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి




**సోంపేట, మే 9(వార్త):** కిడ్నీ వ్యాధితో మృతి చెందిన రామయ్యపట్నం గ్రామానికి చెందిన మత్స్యకారుడు నిట్ట శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని వర్గాలు సహృదయంతో ఆదుకోవాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల శ్రీనివాస్ 40 ఏళ్ల వయసులో కిడ్నీ వ్యాధితో మృతి చెంది కుటుంబాన్ని ఏకాకిని చేశారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబం ప్రస్తుతం రోడ్డున పడింది. శ్రీనివాస్ సముద్రపు వేటకు వెళ్లి చేపల వేట సాగించి వచ్చే డబ్బులతోనే కుటుంబం జీవనాధారం గడిచేది. ఇటువంటి పరిస్థితుల్లో కుటుంబ యజమాని లేకపోవడం ఆ కుటుంబం తీవ్ర ఆందోళనతో సతమత మవుతుంది. ఆ కుటుంబంలో శ్రీనివాస్ తల్లి వాసమ్మ భార్య చంద్రావతి ఒక కుమార్తె ఉన్నారు. ఇది పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా మారింది. ఇటువంటి క్లిష్ట పరిస్థి తుల్లో ప్రభుత్వం స్పందించి శ్రీనివాస్ భార్యకు వెంటనే పింఛను మంజూరు చేయాలని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నిట్ట గోపాలు, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దు రాజారావు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గోఖలే 160వ జయంతి వేడుకలు

**శ్రీకాకుళం, మే 9 (వార్త):** భారత స్వాతంత్ర పోరాటంలో గోపాలకృష్ణ గోఖలే ఎందరో దేశభక్తులను తయారు చేశారని గురజాడ విద్యాసంస్థల లెక్చరర్ సిహెచ్ రాజకుమార్, అవధాన పండితులు పైడి హరినాధరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చౌదరి రాధాకృష్ణ పేర్కొన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్తలు తేజోమూర్తుల స్మృతి వనంలో గోపాలకృష్ణ గోఖలే 160వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గోఖలే విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో మితవాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ప్రస్థానాన్ని వివరించారు. మహాత్మా గాంధీజీ కి రాజకీయ గురువుగా గోఖలే దిశా నిర్దేశం చేశారన్నారు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సంస్థను స్థాపించి దేశం పట్ల సేవ చేసే ఆలోచన యువతలో గోఖలే నింపారన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిరం ప్రతినిధులు నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకర్రావు, పి.పద్మావతి, మెట్ట అనంతం భట్లు, శాస్త్రి తదితరులు ఉన్నారు.






## వెంకన్నకు పచ్చ కర్పూరంతో అలంకరణ

**నరసన్నపేట, మే9(వార్త):** వైశాఖ మాసం నాలుగో శనివారం సందర్భంగా నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామిని పచ్చ కర్పూరంతో ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. వైశాఖ మాసంలో వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

*** ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు * వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది * వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * మంత్రిని సన్మానించిన ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు**



**శ్రీకాకుళం, మే9 (వార్త):** సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహా అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546